క్లుప్తంగా

అవోపా క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అవోపా సభ్యులు

ఆదోని అర్బన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) మహిళా విభాగం 2024 క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. స్థానిక విశ్వహిందూ పరిషత్ భవనంలో జరిగిన కార్యక్రమంలో అవోపా పట్టణ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్ గుప్త, మహిళా విభాగ్ అధ్యక్ష కార్యదర్శులు సంగీత, మమతాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కిల్చిన్‌పేటలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



పథకాల వాల్‌పోస్టర్‌లను విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

ఆదోనిఅర్బన్: స్థానిక కిల్చిన్‌పేటలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నేరుగా ప్రజలకు అందించే సంక్షేమ పథకాల గురించి స్థానిక అధికారులు వివరించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు జిందేసాయికుమార్, ఆదూరి విజయ్‌కృష్ణ మాట్లాడుతూ దేశాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జిందే దత్త, అంజయ్‌కుమార్, పొందే నాగరాజ్, శ్రీకాంత్, అధికారులు, వార్డు కౌన్సిలర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశపరీక్షలు

ఆదోని సెంట్రల్: స్థానిక పురపాలక ఉన్నత, నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాలల్లో శనివారం నవోదయ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 6వ తరగతిలో ప్రవేశానికి నియోజకవర్గంలో 807 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. పురపాలక ఉన్నత పాఠశాలలో 316 మంది పరీక్షలు రాయగా 83 మంది గైర్హాజరయ్యారు. నెహ్రూమెమోరియల్ పాఠశాలలో 306 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 102 మంది గైర్హాజరయ్యారని మండల విద్యాధికారి-2 శ్రీనివాసులు తెలిపారు.

ఆంజనేయస్వామికి పూజలు



కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు పోటెత్తారు. కౌతాళం, అగసలదిన్నె, సుళేకేరి, బుడుములదొడ్డి, ఎరిగేరి గ్రామాల్లోని ఆలయాల్లో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు.

22న శ్రీరాములవారి శోభాయాత్ర



మాట్లాడుతున్న వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు బసవన్నగౌడ్

ఆదోనిఅర్బన్: ఈనెల 22న టూటౌన్ పీఎస్ పక్కన ఉన్న అభయాంజనేయస్వామి ఆలయం నుంచి విక్టోరియాపేటలోని శ్రీరామ మందిరం వరకు అయోధ్య శ్రీరాముల వారి శోభాయాత్ర నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు బసవన్నగౌడ్ తెలిపారు. శనివారం స్థానిక వీహెచ్‌పీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అయోధ్యలో జరిగే బాలరాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని శోభాయాత్ర నిర్వహించనున్నామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, హిందూ ధార్మిక సంస్థల సభ్యులు పాల్గొనాలన్నారు. సమావేశంలో వీహెచ్‌పీ నాయకులు ఈరన్నరావు, ఆంజనేయులు, చెన్నబసప్ప, వర్మ, రాముడు, నీలకంఠ, రాముడు, సీతారాముడు పాల్గొన్నారు.

బంగారు షాపు యజమాని ఉడాయింపు

ఆదోనిఅర్బన్: పట్టణంలో ఓ బంగారు దుకాణం యజమాని 2 రోజుల నుంచి దుకాణం బంద్ చేసి ఉడాయించినట్లు సమాచారం. బంగారం ఆభరణాల కోసం ఆర్డర్లు ఇచ్చినవారి నుంచి వసూలైన డబ్బు, మరమ్మతుల కోసం వచ్చిన బంగారు ఆభరణాలు తీసుకుని దుకాణానికి తాళం వేసి వెళ్లిపోయినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న బాధితులు శనివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని వన్‌టౌన్ సీఐ తేజమూర్తి దృష్టికి తీసుకెళ్లగా.. మరమ్మతుల నిమిత్తం నెక్లెస్ ఇచ్చామని, అతడు దుకాణం మూసేసి వెళ్లాడని ఒకరి నుంచి మాత్రమే ఫిర్యాదు అందిందన్నారు. ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సీఐ సూచించారు. కాగా బాధితులు చాలా మంది ఉన్నట్లు సమాచారం.

మరో మకుటం

వ్యాపార రంగంలో ఆంధ్రా ముంబయిగా పేరుగాంచిన ఆదోని వైఎస్సార్‌సీపీ హయాంలో దినదినాభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే జగనన్న ప్రభుత్వం రూ.4.50 కోట్లు ప్రభుత్వ మెడికల్ కళాశాల, రూ.7 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల భవనంతో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉర్దూ జూనియర్ కళాశాల, వసతి గృహాలను ఏర్పాటు చేసిన జగనన్న ప్రభుత్వం పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతోంది. ఇక స్థానిక ఎమ్మెల్యే వై సాయిప్రసాద్ వ్యాపార పట్టణంగా విస్తరించేందుకు ఉన్న అవకాశాలన్నింటిని పరిశీలిస్తున్నారు. అందులో భాగంగా కొత్తగా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. 4 అంతస్తుల భవనంల దాదాపు 353 షాపులు నిర్మించి వ్యాపారంగంలో అగ్రగామిగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



కాంప్లెక్స్‌లో రెండో బ్లాక్ నమూనా

- ఆదోని పట్టణంలో తలమానికంగా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్
- 353 షాపుల నిర్మాణానికి భూమిపూజ
- ఒకేచోట మటన్, చికెన్, చేపల, కూరగాయల మార్కెట్లు

ఆదోని టౌన్: పట్టణంలో మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం పనులు పూర్తయితే ఆదోనికే తలమానికం కానుంది. ఏకంగా 353 షాపులు, 4 అంతస్తుల భవన నిర్మాణం త్వరలోనే జరగనుంది. ఈనెల 8న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి భూమిపూజ చేశారు. పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని మున్సిపల్ అధికారులు తెలిపారు. ఆదోని చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, అధికారులు చర్యలు తీసుకోవడంతో పట్టణ రూపురేఖలు మారిపోతున్నాయని ప్రజలు, వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రూ.33 కోట్లతో కాంప్లెక్స్

ఆదోని నడిబొడ్డున మున్సిపల్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో రెండు ఎకరాల విస్తీర్ణంలో నాలుగు అంతస్తులు, 353 షాపులతో కూడిన కాంప్లెక్స్ నిర్మితం కానుంది. కొత్తగా నిర్మించే వ్యాపార సముదాయం ఆదోని రూపురేఖలను మార్చబోతోంది. వ్యాపారులు, కొనుగోలుదారులు, ప్రజలు, వాహనదారులకు అనుగుణంగా మార్కెట్‌ను నిర్మిస్తున్నారు. రూ.33 కోట్లతో నూతన కూరగాయల మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్ గుడ్‌విల్ వేలం పాట ద్వారా షాపులను కేటాయిస్తారు. పట్టణం నడిబొడ్డున వృథాగా ఉన్న రెండు ఎకరాల విస్తీర్ణంలో కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనుండటంతో అందరికీ అనువుగానూ నిరుద్యోగులకు ఉపాధి, వ్యాపారులకు అనువుగా ఉండడంతో వ్యాపారాభివృద్ధి చెందడం, మున్సిపాలిటీకి ఆదాయం రానుంది. పట్టణం మరింతగా అభివృద్ధి చెందనుంది. మున్సిపల్ స్థలం, పెట్టుబడిదారుల గుడ్‌విల్‌తో అత్యాధునిక వసతులతో నిర్మాణం జరగనుంది.



కాంప్లెక్స్‌లో ఫస్ట్ బ్లాక్ నమూనా



353 షాపులతో నిర్మాణం కానున్న భవనం నమూనా

చాలీచాలని స్థలంలో మార్కెట్లు

ఆదోని పట్టణంలో చికెన్, మటన్, చేపల మార్కెట్‌లతో పాటు కూరగాయల మార్కెట్ చాలీచాలని స్థలంలో కొనసాగుతోంది. వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్లకు వెళ్లాలంటే ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు. పట్టణం అభివృద్ధి, ప్రజల అవస్థలు, ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకే ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు దృష్టిలో ఉంచుకొని కొత్తగా గుడ్‌విల్‌తో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సిద్ధమయ్యారు. కొత్తగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నేళ్లకు తమ కష్టాలు తీరనున్నాయని వ్యాపారులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆదోనిని వ్యాపార కేంద్రంగా మారుస్తాం



ఒకప్పుడు ఆదోని అంటేనే వ్యాపార వాణిజ్య రంగాల్లో ఆంధ్రా ముంబయిగా పేరుగాంచింది. కాలక్రమేణా జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలలో నష్టాలు రావడంతో యజమానులు మిల్లులను మూసివేశారు. ఫలితంగా వేలాది మంది కార్మికులు ఉపాధిని కోల్పోయారు. దుస్తులు, వంటనూనెల వ్యాపారంలోనూ ఆదోనికి పేరుంది. పూర్వ వైభవం తీసుకొచ్చేందుకే మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనున్నాం. కాంప్లెక్స్ నిర్మాణం మరో యేడాదిలో పూర్తి కానుంది. వ్యాపారపరంగా పట్టణం ఎంతో అభివృద్ధి చెందుతోంది. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.
– వై.సాయిప్రసాద్‌రెడ్డి, ఆదోని ఎమ్మెల్యే

ఒకేచోట అన్ని మార్కెట్లు



పాత బస్టాండ్ కూడలిలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ చేస్తుండటంతో ఆదోనికి మంచిరోజులు వచ్చాయనే చెప్పవచ్చు. ఒక్కొక్క మార్కెట్ ఒక్కోచోట ఉండడం వల్ల ప్రజలు, రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులు, ట్రాఫిక్ సమస్యతో పాటు పలు ఇబ్బందులు పడుతున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతూ అన్ని మార్కెట్లను ఒకేచోట ఏర్పాటు చేస్తుండడం హర్షణీయం. – శంకర్‌రావు, వ్యాపారవేత్త

పౌష్టికాహార కిట్లు అందజేత



క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న దృశ్యం

ఆదోనిటౌన్: నియోజకవర్గంలో క్షయవ్యాధిగ్రస్తులకు ఆరు నెలలకు సరిపడే పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఆర్‌టీపీసీఆర్ ల్యాబ్ వద్ద స్థానిక డాక్టర్లు, లయన్స్ క్లబ్ సభ్యుల సౌజన్యంతో క్షయవ్యాధిగ్రస్తులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోపీనాథ్, రీజియన్ చైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షుడు ధర్మారెడ్డి, డాక్టర్ ఉషారావు, టీబీ డాక్టర్ షేకున్‌బాను, డిప్యూటీ సివిల్ సర్జన్ బాలమురళీకృష్ణ మాట్లాడారు. నియోజకవర్గంలో 34 మంది క్షయవ్యాధిగ్రస్తులు ఉన్నారన్నారు. టీబీ వ్యాధిని నిర్మూలించేందుకు ఖరీదైన మందులను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఆరోగ్యంతో పాటు దృఢంగా ఉండేందుకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కమిటీ మెంబర్లు వన్నపరాజు, టీబీ సూపర్‌వైజర్లు బాబురాజు, మనోరంజనిదేవి, మెరిజ్ఞానేశ్వరి, వీరేష్, సుబ్బమ్మబాయి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ, ప్రజా సంఘాల నాయకులు

ఆదోని రూరల్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పత్తికొండ బైపాస్ రోడ్డులో అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి పి.ఎస్.గోపాల్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి బి.వెంకప్ప, జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, అజయ్‌బాబు వెంకప్ప, వెంకటేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం తగదన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు లింగన్న, నాగరాజు, భీమేష్, మహిళా సంఘం నాయకురాలు మణెమ్మ, ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, పీడీఎస్‌యూ నాయకులు తిరుమలేష్ పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



జేసీకి వినతి పత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

ఆదోని రూరల్: పులికనుమ రిజర్వాయర్ నుంచి ఎల్‌ఎల్‌సీకి వస్తున్న నీటిని ఫారెస్ట్ వద్ద ఇసుక సంచులతో అడ్డుకట్ట వేసి కామవరం పరిధిలోని పొలాలకు నీరు తీసుకెళ్తున్న భూస్వామిపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. శనివారం ఎల్‌ఎల్‌సీ డీ-2 కార్యాలయం ముందు పెద్దతుంబళం గ్రామానికి చెందిన రైతులు ధర్నా చేపట్టి, జేఈకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులికనుమ ప్రాజెక్టు నుంచి వచ్చే నీరు ఎల్‌ఎల్‌సీ ద్వారా చివరి ఆయకట్టుకు నీరు వెళ్లకుండా ఓ వ్యక్తి ఇసుక సంచులతో అడ్డం వేయడం వల్ల రైతులకు నష్టం కలుగుతుందన్నారు. వెంటనే ఇసుక సంచులను తొలగించాలన్నారు. స్పందించిన జేఈ జేసీబీ ద్వారా ఇసుక సంచులను తొలగించి నీరు కిందకు విడుదలయ్యేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, రైతు సంఘం మండల నాయకులు బాషా, రైతులు జహీర్, పీరా, కుల్దిమౌలా, నరసన్న, నీలకంఠ పాల్గొన్నారు.

22న వెంగళాపురంలో భజన

ఆదోని అర్బన్: ఈనెల 22న ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు అయోధ్యలో రామ జన్మభూమి శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పట్టణంలోని వెంగళాపురం ఆంజనేయస్వామి ఆలయంలో రామభజన కార్యక్రమాలు చేపడుతున్నట్లు భజన మండలి కో ఆర్డినేటర్ రామచంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ భజన కార్యక్రమంలో విరివిగా భక్తాదులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు తాయప్ప, ఢణాపురం నాగేంద్ర, నరసన్న, మహిళా భజన మండలి నాయకురాళ్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆదోనిరూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు, సీఐటీయూ నాయకులు స్థానిక మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, యూనియన్ నాయకులు సోమన్న, అహ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల వ్యాఖ్యలు హాస్యాస్పదం

దేవనకొండ: పి.కోటకొండలో బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడు మునిరంగడు వైఎస్సార్‌సీపీకి చెందిన వాడని టీడీపీ జిల్లా అధ్యక్షులు బీటీ నాయుడు వ్యాఖ్యానించడం హాస్యాస్పదమని జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకుడు లుముబా అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ లైంగికదాడికి పాల్పడిన నిందితుడు మునిరంగడుకు వైఎస్సార్‌సీపీ సభ్యత్వమే లేదన్నారు. కావాలనే టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నందవరం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలను సెక్టోరియల్ అధికారి, పీఆర్ ఏఈ జయన్న పరిశీలించారు. శనివారం మండల పరిధిలోని పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, గురజాల, కొత్తకై రవాడిలోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సెక్టోరియల్ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల కేంద్రాలలో మౌలిక వసతుల కల్పించనున్నామని పేర్కొన్నారు. ర్యాంపులు, తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లను పర్యవేక్షించామన్నారు. పోలింగ్ కేంద్రాలలో ముఖ్యంగా ర్యాంపుల నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు.

24న 'ఆడుదాం-ఆంధ్ర' పోటీలు



మాట్లాడుతున్న కమిషనర్ రఘునాథరెడ్డి

ఆదోని సెంట్రల్: ఈ నెల 24న నియోజకవర్గస్థాయి ఆడుదాం-ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. శనివారం పురపాలక కార్యాలయ సమావేశ భవనంలో వ్యాయమ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఆటల పోటీలను పగడ్బందీగా నిర్వహించాలన్నారు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ విభాగాల నుంచి బాలురు 3 జట్లు, బాలికలు 3 జట్లు పాల్గొంటాయన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి మొత్తం 30 జట్లు పోటీ పడనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆడుదాం- ఆంధ్ర కో ఆర్డినేటర్లు నరసయ్య, రామన్న పాల్గొన్నారు.

ప్రతి క్లస్టర్‌లో కుల గణన సర్వే



కౌతాళంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్బారాజు

కౌతాళం: కుల గణన సర్వే ప్రతి క్లస్టర్‌లో పూర్తి చేస్తామని ఎంపీడీఓ సుబ్బారాజు అన్నారు. శనివారం సాయంత్రం వరకు 47.4 శాతం పూర్తి చేశామన్నారు. మండలంలో మొత్తం 26,519 ఇళ్లలో 88,440 మంది నివాసం ఉన్నారన్నారు. వలంటీర్లు, బీఎల్‌ఓలు, వీఆర్‌ఓ, కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి ఆయా కులలపై సర్వే చేస్తున్నారన్నారు. ఈనెల 28లోపు సర్వే పూర్తి చేస్తామన్నారు. ఆయన వెంట సర్పంచ్ పాల్‌దినకర్, కౌతాళం సచివాలయం-1 కార్యదర్శి చెన్నయ్య, సచివాలయం-2 కార్యదర్శి ఆంజనేయులు ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఆదోని సెబ్ సీఐ హరిక్రిష్ణ

ఆదోనిరూరల్: పట్టణంలోని ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డు వద్ద సెబ్ అధికారులు కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ హరిక్రిష్ణ తెలిపిన వివరాలు.. కర్ణాటక మద్యం తలిస్తున్నారనే సమాచారంతో సెబ్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. పట్టణానికి చెందిన బోయ మానస, బోయ వీరేశమ్మలను అదుపులోకి తీసుకుని సోదాలు చేయగా ఒక్కొక్కరి వద్ద ఆరు బాక్సుల ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ కర్ణాటక మద్యం బయటపడింది. మొత్తం 12 కర్ణాటక మద్యం బాక్సులను స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఆదోని సెబ్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి, సిబ్బందిముని, రోహిన్, సుధాకర్, విద్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



ఎర్నాథమ్మకు నగదు అందిస్తున్న ప్రసాద్ స్నేహితులు

తుగ్గలి: బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్న జొన్నగిరికి చెందిన కె ప్రసాద్ గతేడాది డిసెంబర్ 27న గుండె పోటుతో మృతి చెందారు. తమతో కలిసి చదువుకున్న స్నేహితుడు కానరాని లోకాలకు వెళ్లాడని తోటి స్నేహితులు బాధపడ్డారు. స్నేహితుడి కుటుంబానికి అండగా నిలవాలనుకున్నారు. 2023 బ్యాచ్‌కు చెందిన స్నేహితులంతా కలిసి రూ.35వేలు పోగుచేసి ప్రసాద్ భార్య ఎర్నాథమ్మకు శనివారం అందజేశారు. పది నెలల క్రితం చనిపోయిన ఓ స్నేహితుడి కుటుంబానికి కూడా ఇదే బ్యాచ్ రూ.50 వేలు అందజేసింది. స్నేహితుల కుటుంబాలకు అండగా నిలుస్తున్న వీరి స్నేహ బంధానికి ప్రశంసలు దక్కుతున్నాయి.

రథోత్సవం జరిపించండి



ఎస్‌ఐ సతీష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామపెద్దలు

కోసిగి: మండల పరిధిలోని ఆర్లబండ గ్రామంలో వెలసిన అంబాభవానీ రథోత్సవం పురాతన కాలం నుంచి వస్తున్న సంప్రదాయాలు, కట్టుబాట్లు, ఆచారాల ప్రకారం జరిగేలా చూడాలని గ్రామానికి చెందిన ఓ వర్గం పెద్దలు కోరారు. శనివారం ఎస్‌ఐ సతీష్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈనెల 25న పౌర్ణమి రోజున అమ్మవారి మహా రథోత్సవం ఉందన్నారు. జాతరకు వారం రోజుల ముందుగానే రథాన్ని బయటకు తీసి, ముస్తాబు చేయాల్సి ఉందని, అయితే మరో వర్గం వారు తమను ఆలయం వద్దకు రావద్దని చెబుతున్నారని ఆరోపించారు. అనాదిగా పూర్వ కాలం నుంచి వచ్చే ఆచారాలను యథావిధిగా కొనసాగించేలా చూడాలని కోరారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి



క్రికెట్ విజేతలతో పీఈటీలు



క్రికెట్ జట్టుకు బహుమతి అందజేస్తున్న మురళీ మోహన్ రెడ్డి

కౌతాళం: గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని ఎంపీడీఓ సుబ్బారాజు సూచించారు. ఆడుదాం ఆంధ్ర పోటీల్లో చివరి రోజు శనివారం క్రికెట్ ఫైనల్ పోటీలు జరిగాయి. హాల్వి- కామవరం గ్రామాల మధ్య జరిగిన రసవత్తర పోటీలో హాల్వి జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌తో కామవరం సరిపెట్టుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ మండల స్థాయి పోటీలు పూర్తయ్యాయన్నారు. ఇక్కడ విజయం సాధించిన జట్లు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు.

కబడ్డీ విజేత చిన్నతుంబళం

పెద్దకడబూరు: మండలంలో నిర్వహించిన మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు శనివారంతో ముగిశాయి. కబడ్డీ ఫైనల్స్‌లో తారాపురం గ్రామ జట్టుపై చిన్నతుంబళం గ్రామ జట్టు విజయం సాధించింది. విజేతకు ఎంపీడీఓ ప్రభాకర్, ఈఓపీఆర్డీ జనార్దన్ కబడ్డీ కిట్‌ను బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం 15 జట్లు పాల్గొన్నాయన్నారు. విజేత చిన్నతుంబళం జట్టు త్వరలో జరగబోయే నియోజకవర్గ కబడ్డీ పోటీలలో పాల్గొంటుందన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

కోసిగి: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యం వెలికి తీసేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం చేపట్టినట్లు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఎంపీపీ ఈరన్న, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ సమక్షంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడపోటీల్లో గెలుపొందిన వారికి మురళీ మోహన్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వాలీబాల్‌లో కోసిగి సచివాలయం-4, ఖోఖోలో వందగల్లు, షటిల్ బ్యాడ్మింటన్‌లో కోసిగి సచివాలయం-5, క్రికెట్ కోసిగి సచివాలయం-1 జట్టు గెలుపొందినట్లు తెలిపారు. గెలుపొందిన జట్లు ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలలో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో ఆడుదాం ఆంధ్ర ఆర్గనైజర్స్ ఖలీల్ అహ్మద్, రాజారాం, వైఎస్సార్ సీపీ మండల నాయకులు పాల్గొన్నారు.



చిన్నతుంబళం జట్టుకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

సదరం శిబిరం

కోసిగి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం సదరం శిబిరం ఏర్పాటు చేశారు. కాళ్లు, కీళ్లు, చేతులు, వికలాంగత్వం ఉన్న 15 మందిని పరీక్షించి అవసరమైన వారికి స్కానింగ్ టెస్ట్‌లకు రెఫర్ చేశారు. వికలాంగత్వం ఆధారంగా పర్సెంటేజ్ వేసి సర్టిఫికెట్ అందజేస్తామని ఆర్థోఫిజీషియన్ డాక్టర్ మల్లికార్జున తెలిపారు. స్థానిక వైద్యులు మనోజ్‌కుమార్, నజీర్ అహ్మద్, రజిత పాల్గొన్నారు.